క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని వీవీపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో లేన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మంఅర్బన్ విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని నూతన కలెక్టరేట్, జీఆర్ఆర్ శ్రీనివాస్ సముదాయం, రఘునాథపాలెం మండలం గణేశ్వరం, చింతగుర్తి, వేపకుంట్ల, చెరువుకొమ్ముతండా తదితర గ్రామాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు సెమినార్

ఖమ్మంలీగల్: నగరంలోని డీపీఆర్‌సీ భవన్‌లో ఈనెల 30న క్రిమినల్ లాపై న్యాయవాద పరిషత్ ఆధ్వర్యాన సెమినార్ ఏర్పాటు చేసినట్లు న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు హర్కార శ్రీరామారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి కే.సీ.భాను, గౌరవ అతిథులుగా హైకోర్టు జడ్జిలు నగేశ్ భీంపాక, ఈ.వీ.వేణుగోపాల్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

శ్రమదానం..



శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కొర్లపాటి రామారావు, కార్యదర్శి సంగీత ఆధ్వర్యాన గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, కంపచెట్లు తొలగింపుతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

నేత్రదానం..

ఖమ్మంఅర్బన్: గిరిజన సంక్షేమశాఖ వసతిగృహ రిటైర్డ్ ఉద్యోగిని బొందిలి రాధాబాయి(69) అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గురువారం ఖమ్మం నేత్రనిధికి ఆమె నేత్రాలను దానం చేశారు. మధురానగర్‌లో నివాసం ఉంటున్న రాధాబాయి భౌతికంగా లేకపోయిన ఆమె నేత్రాలతో బతికే ఉంటుందని, మరో నలుగురి అంధులకు చూపు నిచ్చిదని అవుతుందని నేత్రనిధి బాధ్యులు తెలిపారు.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్

కామేపల్లి: భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి తీరనిలోటని, ఆయన మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పండితాపురం గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశ జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహార భద్రత దిశగా జీవితకాలం కృషి చేసిన తొలి వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ప్రతీ భారత రైతు హృదయంలో స్థిరస్థాయిగా నిలిచిపోతాడని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	స్కంద
వినోద	పెద్ద కాపు, స్కంద
సాయిరాం	స్కంద
ఆదిత్య	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
శ్రీనివాస	చంద్రముఖి 2

\- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	5
వంకాయ	56		20
బెండకాయ	16	పాలకూర	4
పచ్చిమిర్చి	36		20
కాకర	30	చుక్కకూర	4
బోడ కాకర	100		20
బీర	36	తోటకూర	5
దొండ	20		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	30	మెంతికూర	4
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	46	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	36		20
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

చివరి వరకూ తోడుంటా..

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- కోయచలక, రేగులచలకల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



కోయచలకలో ర్యాలీగా వస్తున్న మంత్రి పువ్వాడ



ఖమ్మం 12వ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అజయ్‌కుమార్

రఘునాథపాలెం: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తన చివరి వరకూ ప్రజలతోనే ఉంటానని చెప్పారు. రఘునాథపాలెం మండలం కోయచలక, రేగులచలక గ్రామపంచాయతీల్లో రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డొంక రోడ్లతో పాటు హైమాస్ట్ లైట్లను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గానికి గతంలో మంత్రి పదవి రాకపోగా, తనకు కేసీఆర్ అవకాశం ఇవ్వడంతో అభివృద్ధి చేయగలుగుతున్నానని తెలిపారు. కాగా, అలవి కాని హామీలతో వస్తున్న కాంగ్రెస్ నేతలను నమ్మకుండా.. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించాలని పువ్వాడ కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గౌరీ, వైస్ ఎంపీపీ గుత్తా రవి, సర్పంచ్‌లు మాదంశెట్టి హరిప్రసాద్, కె.రామారావుతో పాటు చెరుకూరి పూర్ణ, నున్నా వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, మద్దినేని వెంకటరమణ, మందడపు నర్సింహారావు, కొంటిముక్కల వెంకటేశ్వర్లు, బలుసుపాటి సుజాత, కుర్రా భాస్కర్‌రావు, నున్నా శ్రీనివాస్, చెరుకూరి బిక్షమయ్య, పిన్ని కోటేశ్వరరావు, మందడపు సుధాకర్ పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి..

ఖమ్మం అర్బన్: నగరంలోని ప్రతీ డివిజన్‌కు రూ.కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 12వ డివిజన్‌లోని ఎల్ఆర్ఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటికే రూ.కోట్ల నిధులతో అన్ని చోట్ల రోడ్లు, డ్రెయినేజీలు నిరమించామని చెప్పారు. విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్, సుడా చైర్మన్లు దోరేపల్లి శ్వేత, విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావుతో పాటు రంజిత్, వల్లభనేని రామారావు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: దండి విమలమ్మ (78) మృతి పట్ల మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మం నగరం మామిళ్లగుడెంలోని వారి నివాసంలో ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరితో పాటు అడిషనల్ ఎస్పీ రామోజీ రమేష్, ఏసీపీలు వెంకటేశ్, పింగళి నరేష్‌రెడ్డి, సాదుల సారంగపాణి, జమ్ముల జితేందర్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యాన మంత్రికి వినతి

ఖమ్మంవైద్యవిభాగం: వైద్య, ఆరోగ్య శాఖ జారీ చేసిన జీఓ 142ను రద్దు చేయాలంటూ జిల్లా జేఏసీ ఆధ్వర్యాన గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ జీఓతో మానవ వనరుల సంఖ్య తగ్గుతుందని, రాష్ట్రంలో సుమారు 3,800 పోస్టులు రద్దవుతాయని జిల్లాలో ఉప వైద్య ఆరోగ్య కార్యాలయాలు తీసివేయడం, పీపీ యూనిట్, లెప్రసీ వార్డు తొలగించడం వల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు సక్రమంగా అందవని వినతిపత్రంలో పేర్కొన్నారు. శ్రీకాంత్, రమణ, రాధాకృష్ణ, వేణుగోపాల్, కృష్ణారావు, జైపాల్, రాజేశ్వరి, రజని, జానకి, సతీష్, వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పువ్వాడను కలిసిన జిల్లా జేఏసీ నాయకులు

వినాయకా.. సెలవిక

మండపాల్లో కొలువుదీరి ఘనంగా పూజలందుకున్న గణనాథులు గురువారం గంగమ్మ ఒడికి చేరారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను పురవీధుల్లో తిప్పుతూ డప్పు వాయిద్యాల నడుమ డ్యాన్స్‌లు,కోలాటాలతో సందడి చేశారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించి భారీ భద్రతా ఏర్పాట్లు చేయడంతో భక్తులు వినాయకా.. ఇక సెలవు అంటూ విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులతో కిటకిటలాడిన నిమజ్జన పరిసర ప్రాంతాలు నిమజ్జన ఘట్టంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడంతో పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. నిమజ్జనోత్సవం చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: సుబ్లేడులో గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు



కూసుమంచి: గంగాదేవి చెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



కామేపల్లి: పండితాపురంలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న భక్తులు



తిరుమలాయపాలెం: పిండిప్రోలు ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

142 జీఓను సవరించాలి..

కూసుమంచి: జీఓ నం.142ను సవరించాలని కోరుతూ.. మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన గురువారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని వైద్యశాఖ సిబ్బంది క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ.. వనరుల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నం.142లో జనాభా ప్రాతిపదికన కాకుండా ఇష్టానుసారంగా సిబ్బంది బదిలీలు చేపట్టారని, ఈ జీఓ వలన ప్రజలకు మెరుగైన వైద్యం అందే అవకాశం లేకుండాపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వేణుగోపాల్, రమణ, వలీయుద్దీన్, కృష్ణవేణి, రాణి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వైద్య సిబ్బంది

విప్లవవీరుడు భగత్‌సింగ్

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ అని పలువురు వక్తలు అన్నారు. గురువారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మండల కేంద్రాలు, పార్టీ కార్యాలయాల్లో భగత్‌సింగ్ చిత్రపటాలను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో సమసమాజస్థాపన కోసం ఆయన స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



రఘునాథపాలెం: నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

యువజన బీసీ సంఘం అధ్యక్షుడి ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న సురేశ్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం యువజన బీసీ సంఘం అధ్యక్షుడిగా శివాయిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సురేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామమూర్తి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోతగాని రమణకుమార్‌లు గురువారం నియామక ఉత్తర్వులను అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన వారికి సురేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, మధిర డివిజన్ అధ్యక్షుడు మొరం పాపారావు, నగర కార్యదర్శి గజవెల్లి లక్ష్మీ వరప్రసాద్, రూరల్ మండలాధ్యక్షుడు సావిడి శ్రీనివాస్, కూసుమంచి మండల అధ్యక్షుడు నాయిని విజయ్ అచిత్ తదితరులు పాల్గొని అభినందించారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా రాజా



రాజా(ఫైల్)

కూసుమంచి: ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా కూసుమంచికి చెందిన కందుల రాజా నియమితులయ్యాడు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామక ఉత్తర్వులు అందజేశారు. దీంతో తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన నాయకులకు రాజా కృతజ్ఞతలు తెలిపి విద్యారంగ సమస్యలపై పోరాటాలు సాగిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఫీల్డ్ అసిసెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న మాన్‌సింగ్

కామేపల్లి: ఉపాధి హామీ ఫీల్డ్ అసిసెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆదుకోవాలని ఫీల్డ్ అసిసెంట్ల సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ మాన్ సింగ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొత్తలింగాల క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఫీల్డ్ అసిసెంట్ల సమస్యలను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు పని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న సంఘ నాయకుడు దుగ్గి కృష్ణ

కామేపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు దుగ్గి కృష్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు ఉప్పతల వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్, శాంతయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్షుడు గోవిందమ్మ, అనసూర్య, బుచ్చమ్మ, నాగమణి, సైదమ్మ, మరియమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చరణ్‌పై ఉపా కేసు ఎత్తివేయాలి



ఖమ్మంవన్‌టౌన్: ప్రజాపంథా ఆధ్వర్యాన ర్యాలీ



తిరుమలాయపాలెం: బచ్చోడులో నిరసన..

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండ చరణ్‌పై ఉపా చట్టం కింద పోలీసులు బనాయించిన కేసును ఎత్తివేయాలని జిల్లా కార్యవర్గసభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జిల్లా నాయకుడు బందెల వెంకయ్య, పార్టీ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఖానాపురం సెంటర్‌లో ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో పార్టీ ఆధ్వర్యాన, నేలకొండపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గొత్తికొయ్యల సమస్యలపై పోరాడడం నేరమైందని, మావోయిస్టులని ముద్రవేసి అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఉపా లాంటి చట్టాన్ని పెట్టి అరెస్ట్ చేశారన్నారు. ఆదివాసీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, పోడు భూములకు పట్టాలు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరడమే చరణ్ చేసిన నేరమా అన్నారు. పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి శిరోమణి, పార్టీ డివిజన్ కార్యదర్శులు ఝాన్సీ, సీ.వై.పుల్లయ్య, ఎస్‌వీ. రాకేశ్, శివలింగం, కొల్లేటి నాగేశ్వరరావు, శ్రీనివాస్, కంకణాల శ్రీనివాస్, తిమ్మిడి హన్మంతరావు, నరేష్, రామచంద్రు, నర్సయ్య, సత్యనారాయణ, సైదమ్మ, శోభారాణి, పి.రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే కందాళ విస్తృత పర్యటన

తిరుమలాయపాలెం: మండలంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిమ్మక్కపేటలో అనారోగ్యంతో మృతిచెందిన పత్తి అశోక్ మృతదేహాన్ని గురువారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా గోపాలపురంలో ఇటీవల మరణించిన ఉన్నం వెంకమ్మ, కాకరవాయిలో షేక్ మోహిన్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

ఖమ్మంవన్‌టౌన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు జలగం రామారావు ఇటీవల మృతిచెందిన చెందగా.. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ బాధ్యులు వెళ్లి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి జలగం ప్రసాద్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణరావు, చెరుకూరి శేషగిరిరావు, మద్దినేని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కమల్‌నాయక్ మృతిపై సంతాపం..

ఖమ్మంవన్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ధరావత్ కమల్‌నాయక్ చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని మామిళ్ళగూడెంలోని ఆయన నివాసంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

నేలకొండపల్లి: వైస్ ఎంపీపీ పఠానపు నాగయ్య కుమారుడు పఠానపు ప్రసాద్ దశదిన కర్మకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం హాజరై ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన ఇరుగుదిండ్ల రాజును పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయమందించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకుడు కొడాలి గోవిందరావు, చెరువు స్వర్ణ, ఎం.వెంకన్న, వేణు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మంమామిళ్లగూడెం: వయో వృద్ధులను ఆదరించాలని ఖమ్మం సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు డాక్టర్ వి.చంద్రమోహన్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల ఒకటిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మంత్రి అజయ్‌కుమార్, కలెక్టర్, సీపీ, సుడా చైర్మన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సాదినేని జనార్దన్‌రావు, కోశాధికారి కొత్త సత్యనారాయణరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.రవీందర్‌రావు, కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

జాడలేని డ్రైడే..!

అనారోగ్యపాలు కాకుండా వారంలో ప్రతీ మంగళ, శుక్రవారం డ్రైడే ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఇందుకు నిదర్శనం నగరంలోని 5వ డివిజన్.. ఇక్కడ డ్రెయిన్లలో పచ్చని తీగలు అల్లుకుని, మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఇదిగో ఇలా దర్శనమిస్తున్నాయి. అయినా ఇటువైపు చూసే నాథుడే లేరు. అంతేకాక నగర సెంటర్‌లోని ఎన్నెస్పీ విశ్రాంతి భవనం ఎదురు రోడ్డులో కూడా చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతూ భయానకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

\- ఖమ్మంఅర్బన్

